

[ఏడవ భాగము]

నాలుకతో పెదాలను తడుపుకున్నాను.

నన్ను ఈరోజు ఆహారంగా వాడుకుంటారా ఈ నర మాంసభక్షకులు??

వాతావరణానికి వణుకుతోంది అలసిపోయిన నా శరీరం. వున్నట్టుండి నా చూపు ఓచోట తక్కున ఆగింది. చలి కాచుకుంటున్న ఓ నరమాంసభక్షకుడి మెడలో మెరుస్తూ ఏదో కనబడుతోంది.

ఏవిటది? తెచ్చిపెట్టుకున్న శక్తితో కళ్ళు పెద్దవి చేసాను.

మైగాడ్!...

బంగారపు గొలుసు? స్వస్తిక్ చైన్?

అంటె?

శాన్యోరా?

ఏదో తుఫాను నా శరీరంలో కదిలినట్లు ఒళ్ళంతా వణికింది.

సందేహం లేదు.

ఆ గోల్డ్ స్వస్తిక్ చైన్-శాన్యోరా కుసుమకోమల మైన శంఖంలాంటి మెడచుట్టూ అలంకరింపబడి ఉండేది.

ఈ రాక్షసుడి మెడలోకెలా వచ్చింది??

అంటే...

శాన్యోరాని రాత్రే మిగతావాళ్లు...చం...పు...కు తి...న్నా—రా? మోజుపుట్టి ఈ దుర్మార్గుడు ధరించి ఉంటాడు.

సందేహం లేదు. అనాగరికులు తమ విజయానికి చిహ్నంగా యిలాంటి పనులే చేస్తుంటారు.

ఆ ఆలోచన రాగానే నా హృదయం నిప్పులా కాలింది!

కాళ్ళ దగ్గర్నుంచి కణతలదాకా, వర్ణించలేని విచారం విద్యుచ్ఛక్తి తరంగాల్లా ప్రవహించింది!

హిమాలయ పర్వతాలన్నీ కలిసి ఒక్కసారిగా చటుక్కున నా గుండెల మీద కూర్చుని అధః పాతాళంలోకి నన్ను నొక్కేస్తున్నట్లనిపించింది.

నిస్సహాయ స్థితిలో కళ్ళమ్మట కన్నీళ్ళు జలపాతంలా కారిపోతున్నాయి.

తడితో నా కళ్ళు మసకలు కమ్ముతున్నాయి.

సూర్యుడూ, చంద్రుడూ ఈ లోకంలోని ప్రజలూ, ప్రపంచమంతా, ఏ ప్రళయంలోనో కల్సిపోయి, కరిగి

పోయినట్లు కనిపిస్తోంది...

ఏదీ లేని ఆ నిర్మల నిశీధిలోంచి శాన్యోరామూర్తి నా వేపు జాలిగా చూస్తూ, నవ్వి మాయమైంది.

తల తిప్పి భుజాలతో కన్నీళ్ళు తుడుచుకున్నాను.

శాన్యోరాని ఒంటరిగా వదిలి ఎంత పని చేసాను!

హే భగవాన్!

ఇన్నాళ్ళూ నాకు అండదండగా ఉండి కష్టాలు పంచుకున్న శాన్యోరా యిక లేదా?

ప్రభుత్వానికి ప్రక్కలో బల్లెంలా తయారైన గూఢచారిణి శాన్యోరాకి ఈ దిక్కులేని చావే శరణ్యమైనదా?

నా గతిమాత్రం ఏమిటిప్పుడు. నన్నూ ఏ సాయంత్రానికో తినేస్తారు ఈ రాక్షసులు.

నాలో ఉక్రోషం అవధులు దాటింది.

కసిగా పళ్లు నూరాను.

ఆ క్షణంలో నాలో పుట్టిన కోపానికీ ఆవేశానికీ పగ్గాలు లేవు.

శాన్యోరాని చంపిన నరమాంస భక్షకుల్లో ఒకడినైనా ముఖ్యంగా ఆ స్వస్తిక్ గొలుసు ధరించి గర్వపడుతూన్న నరమాంస భక్షకుడినైనా చంపకుండా నేను చావకూడదు.

కనీసం ఆ అవకాశం నా కియ్యి భగవాన్!

చెమర్చిన కళ్ళతో మౌనంగా రోదించేను.

దాహం విపరీతంగా బాధిస్తోంది నన్ను.

మౌనంగా చలి కాచుకుంటున్నారు నరమాంసభక్షకులు-భక్తి.ణిలూ.

సూర్యుడు అప్పుడే తూర్పున ఉదయిస్తున్నాడు.

"రేయ్" అర్చాను నోరు పెగుల్చుకుని.

ఆ కేక విని...నరమాంసభక్షకులు నా వేపు ఓసారి చూసి మళ్ళీ తలలు తిప్పుకున్నారు.

అప్పటిదాకా పాలిచ్చిన ఆ 'స్త్రీ'—తల్లి రాక్షసి, బాలరాక్షసుడిగాడ్ని నేల మీద పడుకోపెట్టి పైకి లేచింది.

నా మెదడులో ఆశ తళుక్కుమంది.

"దా...హం..." అర్చాను మళ్ళీ.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు, నా భాష వాళ్ళ కర్థం కాదు, కదా అని.

తల ఊపాను దగ్గరకు రమ్మని.

తల్లి రాక్షసి చిన్న చిన్న అడుగులతో నా వేపు నడిచింది.

ఆమె నడకకు అనుగుణంగా స్తనాలు కదుల్తున్నాయి.

బంధించబడిన నా దగ్గరగా వచ్చిందామె.

'దాహం' అన్నట్లు పెదాలు తడుపుకుంటూ సంజ్ఞ చేసాను.

ఆ సైగ, ఆ ఆటవికురాలికి అర్థం అయిందో లేదో తెలియదు కాని బలమైన, ఎత్తయిన నా దేహాన్ని చేతితో నిమురుతూ వికృతంగా నవ్వింది.

తేళ్ళూ, జర్రులూ ఒంటి మీద పాకినట్లయింది నాకు.

ముందు నా ప్రాణం దక్కించుకోవాలి.

నా మెదడులో ఓ ఆలోచన మెరిసింది.

అది తప్పో కాదో ఆ క్షణంలో చర్చించ దల్చుకో లేదు నేను.

నోటితో చటుక్కున తాటికాయిలా ఉన్న కుడి స్థనం మొన అందుకున్నాను.

చివ్వున వచ్చాయి పాలు నా నోట్లోకి...

వదల్లేదు నేను...

స్థనాగ్రాన్ని పళ్ళ మధ్య బిగించి, మొండిబలంతో పాలు పీల్చసాగాను. రుచి కూడా గ్రహించకుండా, గబగబా కంఠ నాళాన్ని తడుపుకోసాగాను. నాలుగైదు గుటకలు వేసాను.

కెవ్వున అరిచి వెనక్కి గింజుకుందామె.

కోపంతో బుసలుకొడుతూ బాధగా స్తనాన్ని చేతితో రుద్దుకుంది.

నా ప్రాణం కాస్త కుదుటబడింది.

తడిసిన పెదాలు నాలుకతో తడుపుకుంటూ గర్వంగా నవ్వాను.

అంతే!

రివ్వున ముందుకు వచ్చి నా కుడిభుజం పళ్ళతో పట్టుకుందామె.

కోరలు చర్మంలో దిగబడ్డాయ్! అది అంతకుముందు 'జోనా' మందు వేసిన గాయపడ్డ భుజం!

దిశలు దద్దరిల్లేలా పిచ్చికేక పెట్టాను.

కేక పూర్తయ్యేసరికి భుజంలోంచి పిడికెడు మాంసం కొరికేసిందామె!

దాన్ని నమిలి మింగుతూ నా వేపు చూసిందా రాక్షసి!

"సైతాన్ కా బచ్చా..." వెర్రిగా అరుస్తున్నాను కట్లమధ్య గింజుకుంటూ.

దారుణమైన దృశ్యం!

నా శరీరంలో మాంసం నా కళ్ళముందే తినడం??

రక్తం ధారలుగా కారుతోంది భుజంలోంచి.

అప్పటిదాకా చలి కాచుకున్న స్వస్తిక్ గొలుసు ధరించిన నరమాంసభక్షకుడు పైకిలేచి తల్లి రాక్షసివద్దకు వచ్చి కోపంగా ఏవో సైగలు చేసాడు కీచుగా అరుస్తూ.

ఆ సైగలు నా కర్థమైనాయి.

"ఈ ఆహారం అందరికీ! వెనక్కి రా," అని దానర్థం.

ఆ మెను లాక్కుపోయాడు గొలుసు ధరించిన నరమాంస భక్షకుడు.

రక్తం కారుతోనే ఉంది.

బంధనాలు కొంచెం సడలించుకొని గాయపడ్డభుజాన్ని చెట్టుకు అదిమి పెట్టాను.

మళ్ళీ స్పృహ తప్పింది నాకు.

* * *

ఆ రోజంతా నా కెలాంటి ఆహారం నరమాంసభక్షకులు పెట్టలేదు.

నా పొట్ట వెన్నెముకకు అతుక్కుపోయింది.

మండే ఆకలి నాలో కోపాన్ని గబగబా రగుల్చుతోంది.

కట్లు విప్పితే నేనే మనిషిని నమిలి మింగేసేలాగున్నాను.

ఆకలి బాధ భరించలేక అప్పుడప్పుడు నోటితో కొమ్మలు అందుకొని ఆకులు నవుల్తున్నాను.

నోరు వగరుగా కావడం తర్వాత ఉమ్మేయడం జరుగుతోంది.

గతరాత్రి నుంచి అలాగే చెట్టుకు బంధించ బడడంవల్ల కాళ్ళు విపరీతంగా పీకుతున్నాయి.

వాటిల్లో శక్తి సన్నగిలుతోంది.

భుజానికి అయిన గాయంనుండి రక్తం యిప్పుడు ప్రవహించడంలేదు.

గడ్డకట్టింది రక్తం.

నోటికి అందిన ఆకులు రెండులాగి గాయంమీద అంటించేను నోటితో.

దట్టమైన ఈ ఆఫ్రికా అడవుల్లో నన్ను రక్షించడానికి ఎవరు వస్తారు?

ఇన్నాళ్ళూ నాకు తోడుగా ఉన్న శాన్యోరా.

నా కళ్ళు చెమర్చాయి.

ఆ గొలుసు ధరించిన నరమాంసభక్షకుడ్ని ఎలా చంపటం?

మెల్లగా చీకటి పడ్తోంది.

మృత్యువు ఆసన్నమౌతోంది!!

రాత్రికి నన్ను చంపి నరమాంసభక్షకులంతా విందు చేసుకుంటారు!

మిలటరీ క్రమశిక్షణలో పెరిగిన నా కండలు తిరిగిన శరీరాన్ని బ్రతికుండగానే కండ కండలుగా కొరికి తింటారు.

గుండెలు గుబగుబ లాడుతున్నాయ్.

మరోగంట మృత్యుద్వారంలో నిస్సహాయుడిగా బందీ అయి అలా నిలబడిపోయేను.

ఉన్నట్టుండి ఉలిక్కిపడ్డాను.

వచ్చేసారు!

ఎక్కడెక్కడో తిరిగి నరమాంసభక్షకులంతా, సాయంత్రానికి ఒకరి వెనకాల ఒకరు వచ్చారు నెమ్మదిగా.

అందరూ ఓసారి నా వేపు చూసేరు ఆనందంగా.

ఎదురుగా భోగి మంటలాంటిది ఉదయాన్నించి సన్నగా మండుతోంది.

నడుచుకుంటూ వచ్చిన వారిలో ఇద్దరు నరమాంస భక్షకుల చేతుల్లో నాల్గడుగులు పొడవుగల ఆకారంలో చెక్కబడి ఉన్న దుక్కల్లాంటి బలమైన కొమ్మలు కన్పించాయి.

ఎందుకవి?...

ఏం చేస్తారు నన్ను వాటితో?

నా మెదడులో తేలుకొండిల్లా ప్రశ్నార్థకాలు నిల్చాయి.

ఆ యిద్దరూ మంట కటూ ఇటూ నిల్చున్నారు.

ఊపిరి బిగపట్టి స్థాణువులా నిలబడి పోయి చూస్తున్నాను ఆ కార్యక్రమమంతా.

అయిదు నిముషాల్లో ఆ యిద్దరు నరమాంసభక్షకులూ మంట కటూ ఇటూ ఆ Y ఆకారం కొమ్మల్ని పాతారు.

కొమ్మల్ని ఆ స్తానాల్లో ఎందుకు పాతారు??

నా కర్థం అయిపోయింది.

వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది.

నన్ను బహుశా ఆ Y ఆకారం స్థంభాల మీద పడుకో పెట్టి జారిపోకుండా కట్టేస్తారు.

క్రమక్రమంగా కింద మంట ఎక్కువ చేస్తారు.

నా శరీరం ఉడికిపోతుంది.

ఉడికిన నా శరీరాన్ని అందరూ ఆనందంగా కొరుక్కు తింటారు.

నా ఒళ్ళు కంపించి పోతోంది.

భగవాన్! శత్రువుకి కూడా వద్దు ఈ చిత్రహింస!!

నా కళ్ళవెంట అప్రయత్నంగా వెచ్చటి అశ్రువులు బుగ్గలమీదుగా కిందికి జారాయి.

బొమ్మలతో మృత్యుశయ్య ఏర్పాటు చేసి యమభటుల్లా నరమాంసభక్షకులు నా దగ్గరగా వచ్చారు, గెంతులాంటి నడకతో.

నా కాళ్ళు గడగడ వణుకుతున్నాయి.

యిద్దరు నరమాంసభక్షకులు ముందు, చేతులూ కాళ్ళు ప్రత్యేకంగా కట్టి చెట్టునుంచి పాతకట్లు విప్పి నన్ను వేరు చేసారు.

"హెల్ప్! హెల్ప్!"

గింజుకుంటూనే అరిచాను, నాభి కదిలేలా.

నా అరుపులు ఆ వికృతారణ్యంలో బలహీనంగా ప్రతిధ్వనించాయ్.

ఎక్కడా పిట్టకూడా చప్పుడు చెయ్యలేదు.

నలుగురూ కల్సి నన్ను మంటలవేపు ఈడ్చుకెళ్ళసాగారు.

ఆరడుగుల దూరంలో మంట కనబడుతోంది.

స్ప్రింగులా గింజుకుంటున్నాను వెనక్కి ప్రాణభయంతో.

నా ప్రయత్నం ఎన్నోక్షణాలు సఫలం కావడం లేదు. రాక్షస బలం వారిది!!

ఇలాగైతే వీలులేదని అర్థమైపోయింది వాళ్ళకి.

బంధించబడిన కాళ్ళని యిద్దరు చటుక్కున ఎత్తిపట్టుకున్నారు. స్ట్రెచర్‌లా మోసుకు పోసాగారు నన్ను.

ఇప్పుడు—

మృత్యువు అడుగు దూరంలో నిల్చుని ఉంది.

రెండు వేపుల్నుంచీ నన్ను బస్తాలా మోసుకెళ్ళి ఆ

కర్రల మీద పడుకోబెట్టారు.

కాళ్ళనీ, చేతుల్నీ సాగదీసి కర్ర చివరలకు తీగలతో కట్టేసారు.

స్పర్శన తగిలింది వీపుకి వేడి కింద మంటనుంచి.

భగవాన్!

ఎంత శిక్ష వేసావ్!

చావు ప్రసాదించినా సహజమైన మరణం ఇవ్వలేదు.

నడుంకద్ద ఆధారం లేదు.

కాళ్ళు, చేతులూ బంధించబడి ఉండగా మధ్య మంట సెగ మీదికి వ్రేలాడుతున్నాను. గాయపడ్డ భుజం...!!

తడిసిన చెక్కిళ్ళతో, వేలాడబడుతూ నిస్సహాయంగా అటూ ఇటూ చూసాను.

చేతిలోని ఓ కొయ్య పాత్రతో ఒకడు వచ్చి నా శరీరాన్ని నూనెలాంటి ద్రవపదార్థంతో తడిపాడు.

రాక్షసుడు! శరీరం వేగడానికా?

మిగతా నరమాంసభక్షకులు కొమ్మలూ, ఆకులు వేరు తున్నారు మంటలను మరింత ఉధృతం చెయ్యడానికి.

అందులో స్వస్తిక్ గొలుసు ధరించిన నరమాంస భక్షకుడు కూడా!...

శాన్వోరా! నన్ను క్షమించు! చివరి క్షణాల్లో కూడా నిన్ను చంపినవాడిపై కసి తీర్చుకోలేక పోయాను!

చెంపల మీదుగా జారి, కన్నీళ్ళు అగ్నిలో టప టపా పడుతున్నాయి.

* * *

సరిగ్గా అదే సమయంలో—

దూరంగా చెట్లమధ్య సరసర ధ్వని వినిపించింది.

ఆ ధ్వనితో సమానంగా ఏదో జంతువు అరుపు కీచుగా భీకరంగా వినబడింది.

అరణ్యం గడగడా వణికి పోయింది ఆ అరుపుకు.

సరసర ఆకులధ్వని...

కీచు కేక...

భూకంపం దగ్గరవుతున్నట్లు అదురుతోంది నేల.

చెవిలోని కర్ణభేరి పగుల్తుందా అన్నట్లుగా ఉన్నాయి ఆ భీభత్సపు కీచు కేకలు.

ఆకులు, కొమ్మలు ఏరుతున్న నరమాంసభక్షకులు ఆ పని ఆపి స్థాణువుల్లా నిలబడిపోయి చెవులు రిక్కించారు.

కుడివేపు చెట్లు ఫెళ ఫెళ విరిగి పడ్డాయ్!

వాటి మధ్యనుంచి రాసుకుంటూ వచ్చి, మేమున్న మైదానంలోకి తలపెట్టి భయంకరంగా అర్చింది ఓ ఆకారం!

ఉలిక్కిపడి అటువేపు చూసాను.

డినోసార్!

రాకాశితొండ!!

దాని ముఖం మీద పెద్ద పెద్ద గాయాలున్నాయ్!

చిక్కటి ఎర్రటి రక్తం ధారలుగా కార్తోంది.

నోటిలోంచి చొంగ, తీగలుగా జారుతోంది.

జరజరా ముందుకు మైదానంలోకి పాకింది ఆ భయంకర రాకాశి జంతువు!

అంతే!

నరమాంసభక్షకులు—

గుండెలు బాదుకుంటూ—

హాహాకారాలు చేస్తూ—

తోసుకొంటూ తొక్కుకుంటూ, పరుగెత్తుకుంటూ—

అక్కడ్నించి ప్రాణభీతితో పరిగెత్తారు గెంతుకుంటూ. వారి వెనుకే జర్రున ముందుకి పాకి మంటను చూసి భయ పడి దాని ప్రక్కగా దూసుకుపోయింది.

అలా కదిల్నప్పుడు మహాకాయంగల డినోసార్ శరీరం క్రింద వెనుకగా పరుగెడుతున్న నలుగురు నరమాంసభక్షకులు పడి, నలిగిపోయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.

అంతా క్షణాల్లో జరిగిపోయింది.

నా ప్రక్కగా దూసుకువెళ్ళిన రాకాశితొండంని ఆశ్చర్యంగా పరిశీలించాను. సుమారు వంద అడుగుల పొడ వుంటుంది.

ముఖాగ్రం నుంచి, తోక-చివరివరకూ బలిష్ఠమైన పొలుసులు, రెండు ప్రక్కలా కొనదేరిన కవచభాగాలు. సన్నని, మెత్తటి, పొడుగాటి మెడ.

ఏదో జంతువుదాన్ని రెచ్చగొట్టి ఉంటుంది!
శరీరం మీద అక్కడక్కడా గాయాలున్నాయి.

అయితే రాకాశితొండ "శాకాహారి" అని చాల మందికి తెలియదు!!

అది-అవసరాన్ని బట్టి హింసించడం తప్ప ఏ జంతువునీ-ఏ మనిషినీ తినదు.

ఈ విషయం బుద్ధి వికసించని నరమాంసభక్షకులకి తెలియక పోవడం నాకు చాల మంచిది అయింది.

రెండు క్షణాల్లో డినోసార్ అమిత వేగంతో అడివిలోకి మాయమైంది.

ఒంట్లోని శక్తినంతా కూడదీసుకొని చటుక్కున కాళ్లు విదిలించాను బలంగా.

కాళ్ళు రెండూ మంటలమీద పడ్డాయ్.

క్షణంలో ప్రక్కకు గెంతాను.

పది నిముషాలపాటు శ్రమించి చేతులకీ, కాళ్ళకీ బంధింపబడిన తీగలను కాల్చేసాను మంట మీద పెట్టి.

ఒళ్ళు విరుచుకొని నిలబడ్డాను అలసటగా.

హాయిగా గాలి పీల్చాను కాస్సేపు.

అన్నట్టు వాళ్లు నిప్పు ఎలా తయారు చేసారు??

దేర్ మస్ట్ బి సమ్ సోర్స్!

ఆ ప్రాంతమంతా కలయ తిరిగాను.

కొంత సేపట్లో నా శ్రమ ఫలించింది.

రెండు చెకుముకి రాళ్లు దొరికాయి ఓ చెట్టు మొదట్లో.

వాటిని పాంటుజేబులోకి తోసాను.

అప్పటికే శిధిలమై సగం పీలికలైన చొక్కా, సరున చించి భుజంవద్ద గాయం చుట్టూ కట్టాను.

స్వేచ్ఛ పొందగానే నా బాధ్యతలు మళ్ళీ తేనెటీగల్లా ముసురుకున్నాయ్ యిప్పుడెక్కడికి వెళ్ళాలి??

ఒంటరిగా...

నన్ను ఒంటరివాడిని చేసిన కాన్స్టేరా జ్ఞాపకం వస్తోంది...

నాకు సానుభూతి చెప్పే రెండో ప్రాణి ఈ కీకారణ్యంలో లేదు.

కలత బారిన గుండెలో యాంత్రికంగా అడుగులు ముందుకు వేసాను.

* * *

కాటుకలా ఉంది చీకటి.

తినడానిక్కూడా మీ లేదు.

ఆకలి విజృంభిస్తూనే ఉంది... పైగా దాహం...

నరమాంసభక్షకులు ఈ ప్రాంతాల్లోనే ఉండేవారు.

నీరు వారికీ అవసరమే.

కాబట్టి దగ్గర్లో ఓ చెరువు ఉండి ఉండొచ్చు.

కాని అది ఏ దిశలో ఉందో?

ఒంటరిగా ఈ చీకట్లో, ఈ భయంకర నిశీధ సమయంలో, గుండెలు గబగబ లాడించే చావు నిశ్శబ్దంలో వెతుక్కుంటూ ప్రయాణించడం అసాధ్యం!

కాని దాహం తీరేదెలా?

గబగబా ఓ చెట్టు వద్దకు నడిచాను.

ఆకుల మీద పడిన మంచు బిందువులను ఆత్రంగా చప్పరించేను. కాని అది పెదిమలు తడుపుకోడానికి మాత్రమే ఉపయోగపడింది. జీవితంలో మొట్టమొదటి సారిగా యింతటి క్షుద్బాధ, ఆకలి బాధ అనుభవిస్తున్నాను. తెల్లవారేదాకా ఆహారం వెతుక్కునే అవకాశం లేదు.

ఎలాగో ఓపిక పట్టాలి.

అసలు ఆ చీకట్లో నడిస్తేనే భయంగా ఉంది.

కాలిక్రింద ఏ తీగ, మెత్తగా తగిలినా విష సర్పంలా అనిపిస్తోంది. మానసిక శక్తులను నెమ్మదిగా కూడకట్టుకున్నాను.

ఆ చెట్టెక్కి, అనువైన ప్రదేశాన్ని వెతుక్కుని, మెల్లగా నడుం వాల్చాను ఎదుటి కొమ్మలకు కాళ్లు దాపు పెట్టి.

అప్పుడప్పుడూ అడవి మృగాల అరుపులు దూరంగా... ఎలాగో...విన్పిస్తున్నాయి.

కాళ్ళకీ, చేతులకీ కాస్తంత స్వేచ్ఛ కలిగి, గాలితగిలే

సరికి వెంటనే నిద్రపట్టేసింది.

సరిగ్గా ఓ మధ్య రాత్రిలో ఉలిక్కిపడి లేచాను.

కారణం!

దబ దబా పడుతోంది వర్షం.!

మరోక్షణాన్నే బద్ధకమంతా వదిలిపోయింది.

దబ దబా చినుకులు!

అప్పటికే తడిసిపోయాను పూర్తిగా.

మెరుపులు మెరుస్తున్నాయి.

గాలి రివ్వున వస్తోంది.

కొమ్మలు నిస్సహాయంగా కదులుతున్నాయి.

వర్షం చేయూతతో చలి విజృంభించి—విర్రవీగసాగింది. నాకు తెలియకుండానే నా దవడలు టకటకా కొట్టుకో సాగాయి. నిలువ నీడ లేదు.

కాదు—ఆశ్రయం లేదు.

ఆ వర్షంలో—ఆ చలిలో ఆ కొమ్మలమీద స్థాణువులా కూర్చుండి పోయేను. పాంటు, బూటు తప్ప శరీరాన్నే ఆచ్ఛాదన లేదు.

నా మీద ఎంత కక్ష కట్టావ్ భగవాన్.

ఒక నిస్సహాయుడిమీద నీ ప్రతిభ నిరూపించుకుంటు న్నావ్. పిచ్చివాడిలా దుబ్బులా పెరిగిన గడ్డాన్ని పీక్కు న్నాను...

వర్షం టపటపా పడుతూనే ఉంది నెత్తి మీద.

దాహం విషయం అప్పటికి గుర్తొచ్చింది.

అరచేతులు, దగ్గరగా పెట్టి చేతులు ముందుకు చాపాను. వర్షపు నీళ్ళు దోసిట నిండాయి.

ఆత్రంగా వాటిని తాగి కడుపు నింపుకున్నాను.

ఆ రాత్రంతా ఆ విధమైన నరకం అనుభవిస్తూ వర్షంలో అలాగే మెలుకువగా ఉండిపోయేను రేపు రాబోయే జ్వర తీవ్రతను అంచనా వేసుకుంటూ.

* * *

ఉదయాన్నే పూర్తిగా వర్షం తగ్గిపోయింది.

చెట్టు దిగి నిలబడి జుట్టంతా పిండుకున్నాను.

తడిసి పోయిన పాంటు విప్పి కొమ్మలమీద ఆరేసి అండర్ వేర్‌తో నిలబడ్డాను.

బూటు కాల్లోంచి కత్తితీసి గడ్డాన్ని షేవ్ చేయడం ప్రారంభించాను. పది నిముషాల్లో ఆ పని పూర్తి అయింది.

ఆకలి బాధకు యిక తాళలేనని అప్పుడు గ్రహించాను!

సరిగ్గా అప్పుడే తుపాకీ విషయం జ్ఞప్తి కొచ్చింది.

అవును గుహ-పరిసరాల్లో అది ఉంటుంది.

తుపాకీ దొరికితే ఏ పక్షినో జంతువునో కొట్టి కడుపు నింపుకోవచ్చు. పైగా ఆత్మరక్షణ కది అతిముఖ్యం!

ఓ అరగంట చూసి సగం ఆరిన పాంటును చక చక ధరించాను.

సుమారు గంట తర్వాత నా ప్రయత్నం ఫలించింది.

గుహ కనబడింది.

పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించాను.

పొదల మధ్య కనబడింది అంతకు ముందు నరమాంస భక్షకుడు విసిరేసిన తుపాకీ!

తుపాకీ జాగ్రత్తగా పరిశీలించాను.

థాంక్ గాడ్! పొదల్లో మధ్య పడి ఉండడంవల్ల పైభాగం మాత్రం తడిసింది.

నీళ్లు బులెట్ ఛాంబర్ లోకీ, బారెల్ లోకీ వెళ్ళలేదు.

మాగజయిన్ ఛాంబర్ తెరిచాను.

W స్ప్రింగ్ లో నాలుగు తూటాలు ఉన్నాయి.

మళ్ళీ దాన్ని ఫిక్స్ చేసి సేఫ్టీ కాచ్ లాక్ చేశాను.

అప్రయత్నంగా తలెత్తేసరికి అక్కడి చెట్టుమీద సగం కూలిపోయిన మంచె కనబడింది.

దానిమీదే మొదటి రాత్రి నేను పడుకున్నది.

ఒక్కడినేకాదు__కాన్స్యేరాతో.

యిప్పుడు కాన్స్యేరా......నాతో లేదు.

నాతో కాదు అసలు లేనేలేదు.

షి వజ్ కిల్డ్ బై బ్రూటల్ కానబెల్ బాసర్డ్స్!

భయంకర జీవితానికో తీయని జ్ఞాపకం కాన్స్యేరా!

మాయని గాయం కాన్స్యేరా!

యిక ఆ ప్రదేశంలో ఉండాలనిపించలేదు నాకు.

పెద్ద పెద్ద అంగలతో గుహ దాటి పడమటవేపున నడిచాను.

మూడు మైళ్లు పైగా నడిచి వుంటాను.

అక్కడక్కడ దొరికిన పేరు తెలియని ఫలాలు తిన్నాను.

ఎండ తీవ్రంగా ఉండి చెట్లమధ్య నుంచి భూతలానికి తాకుతూంది.

రకరకాల కోతులు చెట్లమీంచి స్వేచ్ఛగా గెంతుతూ అక్కడక్కడ కన్పిస్తున్నాయ్.

చేతిలోని తుపాకితో ముందుకు నడుస్తూ ఆలోచిస్తున్నాను విపరీతంగా......

నా జీవితం ఎలా తెల్లవారుతుందో తెలియడంలేదు.

నా కళ్ళు ఓచోట ఠక్కున ఆగిపోయాయి. నొసలు

ముడిపడింది.

ఎదురుగా ఓ బోర్డు...

ఆశ్చర్యం!!!

నిర్జనారణ్యంలో బోర్డేమిటి అసలు??

దానిమీద యింగ్లీషులో వ్రాయబడ్డ అక్షరాలు నాలో ఆశారేఖలు చిగురింప జేసాయ్!

చదివాను—కళ్ళు నులుముకొని మళ్ళీ—కలకాదు.

దానిమీద ఈ విధంగా రాయబడివుంది. దారి చూప డానికి ఓ బాణం గుర్తుతో...

"మీకు ఆశ్రయం కావాలా? బాణంగుర్తు చూపబడిన దారిలో మరో రెండుమైళ్ళు నడవండి. అక్కడ మిగతా మార్గం తెలుసుకుంటారు."

* * *

మొదటి ఆధారం బోర్డు.

రెండో క్లూ యింగ్లీషుమాటలు.

అంటే యిక్కడో నాగరికుడు కాని నాగరికులు కాని ఉండివుండాలి.

ఆ ఆలోచన ఎడారిలో మంచినీళ్ళు దొరికినట్లు ఆహ్లా దంగా తట్టింది.

థాంక్ గాడ్! ఆనందం పట్టలేక కళ్ళు మూసుకుని, చేతులు ముడిచి భగవంతుడికి కృతజ్ఞతలు అర్పించు కున్నాను.

నాలో ఆశాదీపం ఉజ్వలంగా ప్రకాశించసాగింది.

ఒకసారి...

రెండోసారి...

ఎన్నోసార్లు మనసుతీరా చదివాను ఆ బోర్డు.

(సశేషం)